క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



కొత్త మోటార్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరు అరుంధతివాడలో తాగునీటి సమస్యను సర్పంచ్ మోహనప్రియ పరిష్కరించారు. రెండు రోజుల కిందట మోటారు మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బుధవారం మరమ్మతులకు గురైన మోటారు స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

ట్యాంకర్ బోల్తా



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామం వద్ద కాళంగి నది వంతెన మలుపు వద్ద బుధవారం ట్యాంకర్ బోల్తా పడింది. చెన్నై నుంచి ట్యాంకర్ తిరుపతికి వెళుతోంది. కాటూరు వద్ద అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. డ్రైవరు, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం పంచాయతీ చల్లంవారి గిరిజన కాలనీలో శ్మశానానికి స్థలం కేటాయించాలని గిరిజనులు కోరారు. ఈమేరకు బుధవారం కాలనీలో నిరసన తెలిపారు. గిరిజనులు మాట్లాడుతూ కాలనీలో ఎవరైనా మృతి చెందిన మృతదేహాన్ని పూడ్చేందుకు స్థలం లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. కాలనీకి ముందు పొలాలున్నాయని, వెనుకవైపున తెలుగుగంగ మెయిన్ కాలువ ఉందన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రికెట్ కిట్ అందజేత



నాగలాపురం: ఆడుదాం-ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన టీపీ పాలెం జట్టుకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు ఆధ్వర్యంలో ఎంపీపీ సింధుశ్యామ్ చేతుల మీదుగా క్రికెట్ కిట్ అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ నియోజక వర్గ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి మండలానికి పేరు తీసుకొని రావాలని అన్నారు. సర్పంచ్ సక్కుభాయి, కార్యదర్శి శైలేంద్ర, సచివాలయ కన్వీనర్ దేశప్పన్ పాల్గొన్నారు.

సీఐగా దివాకర్‌రెడ్డి



దివాకర్‌రెడ్డి

సత్యవేడు: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దివాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన శ్రీశైలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. సీఐ మాట్లాడుతూ, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం మండలాల్లో ఇసుక, మట్టి, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే, ఈ మండలాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ ప్రతాప్

వరదయ్యపాళెం: ఎస్‌ఐగా ప్రతాప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిబంధనల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా సంజ్యామల స్టేషన్ నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డిని సైతం బదిలీ చేశారు. ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరవకాల్వ పూడ్చివేతపై నిరసన

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లెలో భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధనా సంస్థ తిరుపతి(ఐసర్) అభివృద్ధి పనుల్లో భాగంగా వరవకాల్వ పూడ్చివేతపై రైతులు, గ్రామస్తులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అటవీప్రాంతంలోని వరవ కాలువ నుంచి వర్షపు నీరు జంగాలపల్లె పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం, జంగాలపల్లె చెరువులకు వెళుతుంది. చెరువుల కింద సుమారు 350 ఎకరాల ఆయకట్టు ఉంది. రైతులు వరి, వేరుశెనగ, మినుము పంటలను సాగు చేసుకుంటున్నారు. ఐసర్ అభివృద్ధి పనుల్లో భాగంగా వరవ కాల్వకు శాశ్వత అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. గుర్తించిన రైతులు, గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అండర్ బ్రిడ్జితో వరవకాల్వ నుంచి చెరువులకు నీరందక వ్యవసాయ భూములు బీడుగా మారిపోతాయని సర్పంచ్ బొర్రా నారాయణ, రైతులు తెలిపారు..

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి స్వామిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. గోవా మంత్రి మావిన్ గొడింగో, ఆధోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈవో కేఎస్ రామారావు వారికి స్వాగతంపలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సంబరంగా ఆడుదాం..ఆంధ్ర



జ్యోతి వెలిగించి క్రీడలు ప్రారంభిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్



ఖోఖో విజేత వరదయ్యపాళెం బాలుర జట్టు

- రసవత్తరంగా నియోజవర్గ స్థాయి క్రీడా పోటీలు
- ప్రారంభించిన డ్వామా పీడీ, ప్రజాప్రతినిధులు

సత్యవేడు: ఆడుదాం-ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం నియోజవర్గ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. డ్వామా పీడీ సీపీ శ్రీనివాసప్రసాద్, ముఖ్య అతిథులుగా స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీసీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కే.చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ పి.మంజుల ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. క్రీడా కారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు.

ఖోఖో విజేత వరదయ్యపాళెం

బాలికల ఖోఖో పోటీల్లో ఏడు జట్లు పోటీపడ్డాయి. హోరా హోరీగా సాగిన ఫైనల్స్‌లో వరదయ్యపాళెం బాలికల జట్టు విజేతగా నిలిచింది. బాలుర ఖోఖో పోటీల్లోనూ విజేతగా వరదయ్యపాళెం జట్టు విజయం సాధించింది.

కబడ్డీ విజేత నాగలాపురం జట్టు

ఏడు మండలాల స్థాయిలో జరిగిన కబడ్డీ బాలికల పోటీల్లో నాగలాపురం మండలం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సత్యవేడు, నాగలాపురం సచివాలయ జట్లు పోటీ పడ్డాయి. నాగలాపురం సచివాలయం -3 జట్టు విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. కెప్టెన్ యోగోమిని పంచాయతీ కార్యదర్శి హరి, నాగలాపురం పాఠశాల పీడీ బాబు, పీఈటీ సురేంద్ర అభినందించారు.

బ్యాడ్మింటన్ విజేతగా పిచ్చాటూరు జట్టు

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా పిచ్చాటూరు జట్టు నిలిచింది. జట్టు సభ్యులు కిషోర్, మధును పిచ్చాటూరు సర్పంచ్ కేజీ రోస రెడ్డి శాలువతో సత్కరించి అభినందించారు.

వాలీబాల్ విజేతగా నారాయణవనం

నియోజవర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో నారాయణవనం మండలం జట్టు విజయం సాధించింది.



బ్యాడ్మింటన్ విజేతలతో ప్రజాప్రతినిధులు

ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓలు కె.రవి, ఉష, ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి, పీడీలుమురళి, బాబు, కుమార్, జయప్రకాష్, కిషోర్‌కుమార్, రాజ, సురేంద్ర, కిషోర్, నాగరాజు, మణి, గ్రేస్‌ప్రతిమ, అపర్ణ, స్వర్ణ, అమ్ములు, ఢిల్లిరాణి పర్యవేక్షించారు. క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.



ఖోఖో విన్నర్ వరదయ్యపాళెం బాలికల జట్టు



వాలీబాల్ విజేత నారాయణవనం బాలుర జట్టు



కబడ్డీ విజేత నాగలాపురం జట్టు

వైభవంగా సత్యమ్మ జాతర



అమ్మవారి సేవలో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని పరమాలపల్లెలో గ్రామదేవత సత్యమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇంకా అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, పలువురు నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే జగనన్నకు చెబుదాం



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

వరదయ్యపాళెం: సమస్యల పరిష్కారం కోసమే మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 48 వినతులు అందాయని, సమస్యలను ఆయా శాఖల జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, డిప్యూటీ తహసీల్దార్ కాంతి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలేకర్ సంఘం హర్షం



కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకులు

పిచ్చాటూరు: బీసీ కమిషన్ సభ్యుడిగా పాలేకర్ కులానికి చెందిన జె.శేషాచలపతిని ప్రభుత్వం నియమించడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పిచ్చాటూరులో సంఘం నాయకులు సమావేశమైయ్యారు. సురుటపల్లి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడు ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత బీసీ కమిషన్ ఏర్పాటులో పాలేకర్ కులానికి ప్రాతినిద్యం కల్పించడం సంతోషకరమన్నారు. సర్పంచ్ భూపతి, ఎంపీటీసీ సభ్యుడు శోభన్, సంఘం నాయకులు శ్రీనివాసులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని గాజులపెళ్లూరు, కనమనంబేడు, పెద్దపాలేడు, గ్రామాల్లోని పంట పొలాల వద్దకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధర్‌పై పంటల కొనుగోలు తదితర ప్రోత్సాహకాలకు అర్హులు అవుతారన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ రైతులకు రక్ష

నారాయణవనం: సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్ నమోదు చేసుకుంటే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి శోభారాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తుంబూరు, నైనారుకండ్రిగ పంచాయతీల్లో ఈ క్రాప్ చేసుకున్న రైతుల పొలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 1900 ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయని తెలిపారు. 900 ఎకరాల వేరుశెనగ, 500 ఎకరాలలో వరి, 375 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, తృనధాన్యాల పంటల వివరాలను ఈ క్రాప్ కింద నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు నాగూరు, అమ్ములు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ: ఈకాప్ర్ నమోదు చేస్తున్న ఏఓ

బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



శ్రీకాళహస్తి : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమనతలు, లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం.తులసి మాట్లాడుతూ మహిళా రక్షణ హక్కులను వివరించారు. అధ్యాపకులు బాపన య్య, రుద్రమదేవి, రామసుంకన్న, సునీత, సుభాషిణి, రమేష్‌బాబు, పాల్గొన్నారు

అన్ని రంగాల్లో రాణించాలి

బాలికలకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తే పురుషులకు సమానంగా అన్నిరంగాల్లో రాణించగలరని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ ప్రకాష్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి మండలం తొండమనాడు ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. రాజీవ్ ప్రకాష్ మాట్లాడుతూ వివక్ష లేకుండా పెంచాలని సూచించారు. రుయా ఆస్పత్రి సైకాలజీ విభాగం ప్రధానాచార్యులు డాక్టర్ భారతి మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకో వాలని సూచించారు. రక్తహీనత ఏర్పడకుండా ఆరోగ్యంపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో కూడా జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



శ్రీకాళహస్తి : మాట్లాడుతున్న రాజీవ్ ప్రకాష్

బాలికలే రేపటి తరానికి భవిష్యత్తు

కేవీబీపురం: నేటి తరం బాలికలను పోత్సహిస్తే వారే రేపటి తరానికి భవిష్యత్తుగా మారుతారని కేవీబీపురం ఎంఈఓ-2 రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మట్లాడుతూ బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇంకా పోత్సహిస్తే వారు సమాజాన్ని శాసించే స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలతా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ప్రజాప్రగతి ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు సైన్స్ కిట్లను అందించారు. ట్రస్ట్ అధికారి సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు: బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మధురిమ అన్నారు. బుధవారం మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. బాలికల ఆరో గ్య సమస్యలపై అవగాహన కల్పించారు. బాలికా దినోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రగతి సంస్థ క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుభాస్ చంద్రబోస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పేడు: వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



కేవీబీపురం: సైన్స్ కిట్ల అందజేత

రేణిగుంట మండలంలో

రేణిగుంట: మండలంలోని అన్నాసామిపల్లె జెడ్పీ హైస్కూల్లో బుధవారం ప్రగతి సంస్థ, ఏపీ సీఆర్‌ఏఎఫ్ సహకారంతో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పురుషులతో సమానంగా లింగ వివక్ష లేకుండా మహిళలు, బాలికలను సమాజం ప్రోత్సహించాలని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి కోరారు. ప్రోత్సహిస్తే బాలికలు సాధించలేనిదంటూ ఏదీ ఉండదని తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఎదురే లేదు



వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే ఆదిమూలం

- మళ్లీ జగనన్న సీఎం కావడం తథ్యం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: జరగనున్న ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్సార్ సీపీకి విజయభేరి మోగించి, మరో మారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం నారాయణవనం వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాదయాత్రలో పేదల కష్టాలను గుర్తించిన జగనన్న అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లలోనే ప్రకటించిన మేనిఫెస్టో హామీలకు తోడు మరిన్ని సంక్షేమ పథకాలను నూటికి నూరు శాతం అమలు చేశారని అన్నారు. పరిపాలనను వికేంద్రీకరణ చేస్తూ గడప వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తూ, విభేదాలకు తావులేకుండా అందరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారని, మరో మారు ఎన్నికల కురుక్షేత్రంలో వైఎస్సార్ సీపీకి విజయ ఢంకా మోగించడం తథ్యమని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధానికి మీరంతా సిద్ధమా, ఎన్నికల కురుక్షేత్రంలో గెలిచేందుకు మీరంతా సిద్ధమా, జగనన్న కోసం తోడేళ్ల గుంపుతో పోరాడేందుకు మీరంతా సిద్ధమా, మరోసారి జగనన్నతో కలిసి నడిచేందుకు మీరంతా సిద్ధమా, జగనన్నను మెజారిటీతో గెలిపించేందుకు మీరంతా సిద్ధమా అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ప్రధాన కార్యదర్శి కోనేటి బాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అన్నాదొరై, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

నారాయణవనం: మండలంలో గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సారకాయలు తెలిపారు. నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనంగా నిర్మించిన భవనాలను ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సంప్రదాయ ఉత్సవాల పునరుద్ధరణ

శ్రీకాళహస్తి: ఆలయ పురాతన సంప్రదాయ ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. ఆలయ పురాతన సంప్రదాయ ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని బుధవారం హిందూ ధార్మికమండలి సభ్యులు దేవస్థానం చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తై అమావాస్య సందర్భంగా పవిత్ర భరద్వాజతీర్థంలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించాలని కోరారు. స్పందించిన ఆయన 1885లో నిర్వహించినట్లు స్థల పురాణాలు చెబుతున్నాయన్నారు. దేవదాయశాఖ అధికారులు, ఆలయ ప్రధానార్చ కుల దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరణ చేయాలని కోరినట్లు తెలిపారు. త్వరలోనే అనుమతి లభిస్తుందని పేర్కొన్నారు. హిందూ ధార్మికమండలి సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, వాసుయాదవ్, అమర్‌నాథ్, ఢిల్లీబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న హిందూ ధార్మిక మండలి సభ్యులు

శరవేగంగా కులగణన సర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కులగణన సర్వేను గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు శరవేగంగా చేస్తున్నారు. సచివాలయాల సిబ్బంది వలంటీర్లతో పక్కాగా సర్వే నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలను ఫోన్ ద్వారా నమోదు చేసి, కుటుంబంలో రేషన్ కార్డు వివరాలు, విద్య, మరుగుదొడ్డి, తాగునీరు, గేదెలు, కోళ్లు, వంట గ్యాస్, లేదా కట్టెల పొయ్యి తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన కులం మాత్రమే నమోదు చేస్తూ, సర్వే పూర్తయిన తరువాత ఈకేవైసీ, బయోమెట్రిక్ చేయిస్తున్నారు. త్వరతిగతిన సర్వేను పూర్తి చేస్తున్నట్లు తహసీల్దారు భార్గవి తెలిపారు.



సర్వే చేస్తున్న వలంటీర్లు, సిబ్బంది, నాగలాపురంలో..

నాగలాపురం: నాగలాపురం మేజర్ పంచాయతీ సచివాలయం-2 పరిధిలో ఎంపీడీఓ పీఎంకె బాబు ఆధ్వర్యంలో బుధవారం కులగణన సర్వే జరిగింది. నాగలాపురం కార్యదర్శి రోజా, ఏఎస్‌ఎం భార్గవి, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.

వెలవెలబోయిన జయహో బీసీ సభ

నాగలాపురం: టీడీపీ నేతలు బుధవారం ఆడంబరంగా ఏర్పాటు చేసిన జయహో బీసీ సభ నాయకులు, కార్యకర్తలు లేక వెలవెలబోయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ వ్యతిరేక వర్గం ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టింది. స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ సభను బీసీ వర్గాలే బహిష్కరించాయి. కనీసం 20 మంది కూడా లేకుండానే కార్యక్రమాన్ని మమ అనిపించారు. హెలెన్ వద్ద నాయకులు తమ కష్టాలను వాపోయినట్లు సమాచారం. కార్యకర్తల పేర్లు చెప్పి పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసయాదవ్ వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తున్నారని టీడీపీ నేత, నాగలాపురం ఫస్ట్ వార్డు మెంబర్ ఏలుమలై తీవ్రంగా దుయ్యబట్టారు. కదలిరండి కార్యక్రమానికి 500 మందిని తీసుకొస్తామని చెప్పి రూ.1.65 లక్షలు కాజేశారని మండిపడ్డారు. ఇలాంటి వారిని నమ్మి పార్టీలో ఎలా పనిచేయా పనిచేయాలో అర్థం కావడం లేదని వాపోయారు. ఈ కారణంగానే తాము పార్టీ కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు పలువురు బీసీ నాయకులు సైతం పెదవివిరిచారు. కనీసం 20 మంది కూడా కార్యకర్తలు లేకపోవడంతో నాయకులపై హెలెన్ ఒకింత అసహనం వ్యక్తం చేసి, కేవలం 20 నిమిషాల్లో కార్యక్రమాన్ని ముగించడం విశేషం



నాగలాపురంలో జరిగిన జయహో బీసీ సభ

క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ చైతన్యపురం ఎస్టీ కాలనీలో బుధవారం నిర్వహించిన క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. రాస్ మహిళాజ్యోతి, టాటా ట్రస్ట్ వెంకటేశ్వర క్యాన్సర్ ఆస్పత్రి, పద్మావతి మహిళా యూనివర్శిటీ ఉమెన్ స్టడీ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన ఈ క్యాంపులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. స్థానికులకు బీపీ, షుగర్, హెపటైటిస్ బీ అండ్ సీ, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లకు సంబంధించి పరీక్షలు చేశారు. మందులను పంపిణీ చేశారు. టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్, అమరావతి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, పద్మావతి మహిళా యూనివర్శిటీ ప్రొఫెసర్ హైమావతి, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్, లన్సలగస్, జ్యోతి, నాగమణి, ఇందుమతి, స్వాతి పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల విధులు నిరుపమానం



డ్రైవర్లను సన్మానిస్తున్న దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ప్రయాణికుల ప్రాణాలే మిన్నగా డ్రైవర్ల విధులు నిరుపమానమని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. బుధవారం బస్టాండు ఆవరణలో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు డ్రైవర్లను సన్మా నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిక జీవితంలో డ్రైవర్లు ఎన్నో ఒత్తిళ్లకు లోనవుతున్నారని, ముఖ్యంగా పనిభారం అధికంగా ఉండడం, డబుల్ డ్యూటీలు చేయాల్సి రావడం వంటి కారణంగా వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ కుటుంబాలకన్నా, తమ ప్రాణాల కన్నా మిన్నగా భావిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న డ్రైవర్ల సేవలు అభినందనీయమన్నారు. డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి, యూనియన్ నాయకులు శ్రీనివాసకుమార్, జీపీఎస్ ఆచారి, టీఎల్ మూర్తి, చలం, కుప్పయ్య, పీఆర్ బాబు, మురళి, చంద్ర, మణి, పట్టాభి, బాబు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.